అమృత్ కిరణ్ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

# అరుదు

సోమయాజుల శ్రీనివాసరావు,

తిలక్ రోడ్డులో బస్సుదిగి, రెండు సూట్ కేసులతో, మరో పెట్టెతో రోడ్డు పక్కకెళ్ళి నిలబడగానే, అక్కడ రిక్షాల్లో కూర్చున్న రిక్షావాళ్ళు లక్ష్మణ్ వైపు చూసేరు ఆశగా, తమని పిలుస్తాడేమోనని. అతనూ వారివైపు అడుగువేసేడు.

అందులో ఓ రిక్షావాడు 'ఎక్కండి బాబూ, ఎక్కడి కెళ్ళాల?' అనడిగాడు.

లక్ష్మణ్ వాడివైపో చూపు చూసేడు. పెద్ద పెద్ద గుంటలు పడిన మొహంతో, చూడగానే... వికారం కలిగించేలా ఉన్న ఆ రిక్షావాణ్ణి చూసి వెంటనే మొహం తిప్పేసుకున్నాడు అయిష్టంగా..

జవాబు ఇవ్వలేదు. సరికదా

ఆ రిక్షావాడు బాధపడతాడని ఊహించ కూడా లేదు. ఆ రిక్షావాడు మొహం చిన్నబుచ్చుకొని మరోసారి మాట్లాడలేదు. అలాగే కూర్చున్నాడు తన రిక్షాలో.

లక్ష్మణ్ మరో రిక్షావాణ్ణడిగేడు. 'వస్తావా?' అని.

'ఏడకెళ్ళాల బాబూ? ఎక్కండి' అన్నాడు నల్లగా, సన్నగా ఉన్న ఆ వ్యక్తి.

'ఇక్కడే కొర్లగుంట తెలుసుకదా?' అన్నాడు లక్ష్మన్ పెద్ద దూరంకాదు అనే సూచనతో.

'ఎందుకు తెలవదూ? అన్నాడు బదులుగా.

'ఐతే చూడు. ఇవీ సామాన్లు, నేనూ కూడా వస్తాను' అన్నాడు లక్ష్మణ్.

'అట్లాగే' అన్నాడు. సామాన్లనీ లక్ష్మణ్‌నీ పరిశీలనగా చూసి, ఎంత అడగాలో అంచనా వేసుకుంటూ. ఎంత తీసుకుంటావో చెప్పమని అన్న మాటలకి..

'ఆర్రూపాయలివ్వాల' న్నాడు ఆ రిక్షా మనిషి తాపీగా.


'ఏవిటీ! మైలు దూరం ఉన్న కొర్లగుంటకి ఆర్రూపాయలివ్వాలా?' అన్నాడు లక్ష్మణ్ ఆశ్చర్యంతో అదిరిపడి.

ఊళ్ళో నివసించే తనకే ఇంతరేటు చెప్తున్నాడు, క్రొత్త వాళ్ళ దగ్గర ఎంత అడుగుతాడో కదా! మరీ ఇంత అన్యాయమా? అని తనలోనే అనుకుంటూ...

'నాలుగు రూపాయలకి మించి ఇవ్వను. ఇష్టముంటే, రా!' అన్న లక్ష్మన్ మాటకి.

'ఐదు రూపాయలకి ఒక్కపైసా తగ్గేది లేదు! అని ఖచ్చితంగా అన్నాడు బదులుగా.

లక్ష్మణ్ మాట్లడకుండా మరో రిక్షావాడి దగ్గరకెళ్ళి అడిగేడు. వాడూ ఐదు రూపాయలకైతేనే వస్తానన్నాడు.



మరో రిక్షావాడి దగ్గరకెళ్ళేడు లక్ష్మణ్.

చినుకులు మొదలవడంచూసి వాడు ఆర్రూపాయలకి తక్కువిస్తే రిక్షా కదపనన్నాడు.

లక్ష్మణ్ పరిస్థితి అర్థంచేసుకున్నాడు. రిక్షావాళ్ళకి చదువూ, సంధ్యలూ లేకపోయినా, తెలివితేటలూ, ఐకమత్యం బాగా ఉంటాయి.

రిక్షావాళ్ళకే కాదు, ఎవరికేనా, ఏ వృత్తి, వ్యాపారంలో ఉన్న వారికైనా... ఇవి తప్పనిసరి. వర్షం హెచ్చితే వారు ఇంకా డిమాండ్‌చేసే అవకాశం బాగా ఉందని తేలిగ్గా ఊహించగలిగేడు.

'ఏం చెయ్యాలి? చచ్చినట్లు ఐదో,ఆరో ఇవ్వాల్సిందే! ఐదు రూపాయలడిగిన మొదటి వాడ్ని దగ్గరకే వెళ్దాం' అనుకుంటూండగా స్టేషన్‌కి బేరం కుదిరి... ఆ కష్టమర్‌ని ఎక్కించుకున్నాడు ఆ రిక్షావాడు. లక్ష్మణ్ వైపు గర్వంగా

## పరిచయం



పేరు :సోమయాజుల శ్రీనివాసరావు

వయస్సు : 35 సం॥లు

విద్యార్హతలు: మెట్రిక్ ఉత్తీర్ణత

స్వస్థలం : హైదరాబాద్

వృత్తి : నోయిడా (యు.పి)లో వ్యాపారం.

అభిరుచులు: సంగీతం, సాహిత్యం ఆస్వాదించటం.

పాతక్రొత్తల మేలుకలయికే జీవితం అని నా నిశ్చితాభిప్రాయం.

అడ్రస్

**సోమయాజుల శ్రీనివాసరావు**

నెం.241, సెక్టర్ -15 ఏ

నోయిడా-1 (యు.పి)-201 301.


చూసేడు. 'చూసేవా? నా మాట కాదన్నావు! ఇంక ఇక్కడే వర్షంలోతడువు' అన్న అర్థం వచ్చేలా.

లక్ష్మణ్ మొహం తిప్పుకుని,అంతే అడిగిన, మరో రిక్షావాడి దగ్గరకెళ్ళి అన్నాడు' సరే! ఇస్తాను! పద అని అన్నాడు,

వాడు తలెత్తి అన్నాడు.'ఐదు కాదు, ఆరియ్యాల!' అన్నాడు దృఢంగా.

లక్ష్మణ్ నివ్వెరపోయాడు.

'ఇంతకు ముందు ఐదే అడిగేవు కదా?' అన్నాడు విస్మయంగా చూస్తూ.

'అప్పుడు సరిగా ఆలోచించక అడిగినాను. అదీకాక, అప్పుడు వర్షంలేదు కదా?' అన్నాడు పాయింట్ లాగుతూ.

లక్ష్మణ్‌కి అవగతమైంది, ఇప్పుడు తన అవసరం కొద్దీ మళ్ళీ వాడి దగ్గరకెళ్ళేడు! వర్షం అప్పుడు లేదు, ఇప్పుడు బాగానే పడుతోంది, ఈ వర్షం పెద్దదైతే తనకిబ్బంది! ఇవన్నీ ఆలోచించే, ఎంతో తెలివిగా మరో రూపాయి ఎక్కువ డిమాండ్ చేస్తున్నాడు.

తన అవసరంతో ఎంత తెలివిగా లాభం పొందాలని చూస్తున్నారు ఈ నిరక్షరాస్యులు!

శ్రమ దోపిడీకి గురయ్యే వాళ్ళంటూ కార్మికుల్నీ, శ్రామికుల్నీ పేర్కొంటూ. వాళ్ళ చెమట, షావు కారులు రక్తంగా మార్చి తాగుతారని కవులూ,కమ్యూనిస్టులూ వల్లిస్తారు!

కానీ ఆరోజులుపోయేయి. అవకాశముంటే, ఎవరు ఎవరినైనా 'దోచుకుంటాడు' ఇదే ప్రత్యక్ష ఋజువు! తిరుగులేని నిదర్శనం!

ఇలా ఆలోచిస్తూ, నిలబడిన లక్ష్మణ్ చేసేదిలేదని, ఆ రిక్షా ఎక్కుదామని అనుకుంటుండగా, అతని దృష్టి, మొదట గుంటలు పడ్డ మొహంతో తనని అడిగిన రిక్షావాడి మీద పడింది.

ఆ వ్యక్తి అలాగే కూర్చుని, పడుతున్న వర్షం చినుకుల్ని చూస్తున్నాడు. లక్ష్మణ్ అతని దగ్గరకెళ్ళి 'ఏమయ్యా! వస్తావా?' అని పిలిచేడు.

లక్ష్మణ్‌ని చూసి అతని కళ్ళు మెరిసేయి, 'పదండి బాబూ' అని క్రిందికురికేడు.

'కొర్ల గుంటకి పోవాలి' అన్న లక్ష్మణ్ మాటలకి 'అలాగే' అన్నాడు.

'ఎంత కావాలి?' అన్న లక్ష్మణ్ మాటలకి, 'ఐదు ఇప్పించు సామీ!' అన్నాడు.

లక్ష్మణ్ మరో మాట మాట్లాడకుండా సామాన్లు రిక్షాలో పెట్టేడు. రిక్షాలో కూర్చున్నాడు. గూడు క్రిందికి దించేడు రిక్షావాడు. ఇప్పుడు లక్ష్మణ్ మనసు మళ్ళా ఆలోచనలో పడింది.

తను అసహ్యంతో కాదన్నరిక్షావాడే మళ్ళాతనకు శరణయ్యేడు. వర్షం పడుతున్నా ఎక్కువ డిమాండ్ చేయలేదు. ఐదు రూపాయలు మాత్రం అడిగేడు.

వర్షం పడకపోతే, తను మొదటే వాణ్ణి కుదుర్చుకొనుంటే, తననుకున్న ఆ నాలుగు రూపాయలకే వచ్చుండేవాడేమో! మొహం అసహ్యంగా ఉందని గిరాకీలు రావేమో? అందుకే కదూ, ముందుసారి అడిగితే తను జవాబుకూడా ఇవ్వలేదు.

మనిషి ఎలా ఉంటేనేం, మంచివాడు, మర్యాద తెల్సిన వాడునూ. మనిషి బలహీనతని సొమ్ముచేసుకోవాలనుకునే రకం కాదు! వీడు మంచి వ్యక్తి.

కొర్లగుంటలో తన ఇంటిముందు రిక్షాదిగి, సామాన్లు దించి జేబులో నుండి రెండు రూపాయలనోట్లు రెండు ఇచ్చి 'రూపాయి తక్కువుందోయి, నా దగ్గర మరి చిల్లరలేదు, వందనోటుంది మరి. చిల్లర దొరుకుతుందో లేదో! అని డబ్బులిచ్చి, వందనోటు చూపేడు లక్ష్మణ్.

నాలుగు రూపాయలందుకొని 'చిల్లర వందకి దొరకదు బాబూ, మీరే మార్చి ఇవ్వాల రూపాయ' అన్నాడా రిక్షా వ్యక్తి.

'మరి నాకూ దొరకదు! అయినా ట్రై చేస్తాను' అని రెండు మూడు దుకాణాల్లో వందనోటుకి చిల్లరడిగి దొరకలేదని వచ్చేసేడు లక్ష్మణ్.

'నన్నేం చేయమంటావ్' అన్నట్లు చూస్తూ...

'మీకే దొరకలేదంటే, నా మొఖం చూసి ఎవడిస్తాడు! నే పోతాను . ఎప్పుడన్నా నా మొఖం కనబడితే గుర్తుంచుకొని ఇవ్వండి సార్' అన్నాడు ఆ రిక్షావాలా ఔదార్యంగా.

లక్ష్మణ్ దిగ్భ్రాంతి చెందేడు. అడిగిన మొత్తం కన్నా ముందే ఎక్కువ పిండి, అర్ధా, పావలా చిల్లర కష్టమర్స్‌కివ్వాలంటే 'పేదోణ్ణి వదిలేయి సామీ,సారూ!' అని నేర్పుగా కాటేసే ఈ కాలంలో, సునాయాసంగా తన రూపాయి వదిలేసే వాడు ఉండటం ఆశ్చర్యం, అత్యంత అరుదూ!

మొదట వర్షంలో న్యాయంగా అడగడమే ఒకవింతా. ఆశ్చర్యం కాగా మళ్ళీ ఇలా రూపాయిని, విధిలేకనే. అయినా పెద్దగా ఆలోచించకుండానే వదులు కోవడం ఎంత అబ్బురం! వండర్!

'చూడూ, నీవెప్పుడు కనబడినా, బజార్లో కానీ. ఈ చోటకానీ, నీ రూపాయితప్పకుండా ఇచ్చేస్తాను. నువ్వు రేపో, మర్నాడో, మరెప్పుడైనా కానీ... ఇదే ఇంటికి వచ్చి నీ డబ్బు తీసుకుపోవచ్చు. సరేనా!' అన్నాడు లక్ష్మణ్ ఆ రిక్షావాలాతో. అనునయంగా, మెత్తగా ఆదరం ఉట్టిపడే గొంతుతో ఇప్పుడతనికి ఆ రిక్షా మనిషి మీద సదభిప్రాయం, గౌరవం తప్ప అసహ్యం లేదు.

ఆ గుంటలు పడ్డ మొహం మామూలుగా అన్పిస్తోంది.

మొదట కలిగిన జుగుప్స, తృణీకారం స్థానే మన్ననా, ఇష్టం ఏర్పడ్డాయి.

ఒక మనిషిలోని బాహ్య వికారానికి వెగటుకలిగిన మనసు మారి, అదే మనిషిలోని అతః' సౌందర్యానికి, స్వచ్ఛతకీ ముగ్ధుడై తనలోని సంస్కారానికీ, విద్యార్హతకీ సార్థకత కల్పించుకున్నాడు. ఎదుటి మనిషిని మనసుతో చూసి, ఆ మనిషిలోని మంచినీ, మానవతనీ గుర్తించడం ద్వారా...

'అట్లాగే సామీ. అట్లాగే, నే పోయొస్తా, మళ్ళా!' అని వెళ్ళేడు రిక్షావాడు.

ఇంటితాళం తీస్తూ అంతమంచి 'మనిషికి రూపాయి బాకీ పడ్డానే. అది ఇచ్చేదాకా శాంతి ఉండదు. ఈ సారెప్పుడన్నా ఇచ్చెయ్యాలి. కిరాయి అనుకొని కాకపోయినా, ఆ మంచికి బహుమతిగా' అనుకున్నాడు లక్ష్మణ్ మనసులో, మనస్ఫూర్తిగా.